అందరికీ ఆరోగ్య భద్రత

- అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం
- దేశానికే ఆదర్శం ముఖ్యమంత్రి పాలన
- 11 నుంచి 'జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


జగనన్న సురక్ష కార్డుతో వృద్ధురాలు


జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

జగదాంబ : జగనన్న ఆరోగ్య సురక్ష భవితకు భరోసా అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వినూత్న కార్యక్రమం నిర్వహించి మిగతా రాష్ట్రాలకు జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రంలో కోటీ ముప్పై లక్షల కుటుంబాల్లో ఐదు కోట్ల యాభై లక్షల మంది భవితకు జగనన్న ఆరోగ్య సురక్షతో భవితకు బంగారు బాట వేశారన్నారు. చిన్నచిన్న రోగాలకు వార్డుల్లో ఉండే ఆరోగ్య కేంద్రాల్లో, పెద్ద వ్యాధులకు కార్పొరేటర్ ఆస్పత్రుల్లో చికిత్స అందించే విధంగా జగనన్న ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ప్రజారోగ్యానికి రాష్ట్ర జీడీపీలో 7.9 శాతం కేటాయించి సీఎం జగనన్న ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు బాటలు వేశారన్నారు. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా తొమ్మిది వందల వ్యాధులకు చికిత్స అందిస్తే తండ్రికి తగ్గ తనయుడైన జగన్‌మోహన్‌రెడ్డి 3,250 వ్యాధులతో పాటు గుండె మార్పిడి, కిడ్నీ మార్పిడి వంటి వాటికి కూడా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నారన్నారు. ఇంటింటి సర్వేతో ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని చికిత్స అందించే ఏర్పాట్లు చేశారన్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆశించే విద్య, వైద్యం వంటి ప్రధాన అవసరాలు తీరుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు.

11 నుంచి మీ ఇంటికి వస్తాం..

ఈనెల 11వ తేదీ నుంచి 'మీ ఇంటికి వస్తాం' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 'రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి' అనే విషయంపై మాట్లాడుతామన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఏం చేయాలి.. ఏం చేస్తే ఆ కుటుంబం బాగుంటుందనే విషయంపై అధ్యయనం చేసి ఆ నివేదికను జగనన్నకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, వైద్యాధికారులు సింధు, కె. సందేష్, కార్పొరేటర్ మహ్మద్ సాధిక్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు సనపల రవీంద్ర, పీతల వాసు, అనురాధ, మాజీ కార్పొరేటర్ పచ్చడిపల్లి రాము, బోదుల ఉమామహేశ్వరరావు, 38వ వార్డు ప్రెసిడెంట్ సన్యాసిరావు, బెహరా వెంకటరత్నం, దశమంతుల మణిక్యాలరావు, బోడి నర్సింహాచారి, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవ, కోఆప్షన్ మెంబర్ షరీఫ్, రవి, సలీం, సతీష్, కమాలుద్దీన్, బంగారమ్మ, ఏఎన్ఎంలు, కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రోగుల డేటా ఎంట్రీ తీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు..



జగన్‌బాబు ఆరోగ్యానికి భరోసా కల్పించారు. చిన్నపాటి వైద్యం కూడా చేయించుకోలేని మాలాంటి వారెందరికో ఈ ఆరోగ్య సురక్ష బాగా ఉపయోగపడుతుంది. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చాను.

–మల్లయ్య, 39వ వార్డు, మౌలానా పంజావీధి

ఈ పథకం ఇలాగే కొనసాగించాలి..



పేద ప్రజలకు బాగా ఉపయోగపడే పథకాలు జగనన్న ప్రవేశపెడుతున్నారు. మొన్న విద్య, ఈ రోజు వైద్యం.. ఈ పథకాలు ప్రజలకు ఉపయోగకరం. ఇవి ఇలాగే కొనసాగించాలి. రక్త పరీక్షలు చేయించుకోవడానికి వచ్చాను..

కె.రమ, 39వ వార్డు, కోటవీధి

క్లుప్తంగా

ఎమ్మెల్యే వాసుపల్లికి సన్మానం


ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వివేకానంద సంస్థ సభ్యులు

జగదాంబ : పాతనగరం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను స్వామి వివేకానంద సంస్థ సభ్యులు సత్కరించారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా పాతనగరం కనీసం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో వాసుపల్లి గణేష్‌కుమార్ ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్ : దసరా ఉత్సవాలకు సంబంధించి పాతనగరం 39వ వార్డు కోటవీధి ఏరియాలో కేవీ గోల్డెన్ బాయ్స్ నిర్వహించనున్న వేడుకలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సొంత నిధుల నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు దక్షిణ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, శివారం టీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

దేవాలయాన్ని పరిశీలించిన అధికారులు


గంభీరంలో ఆలయాలను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో గల బంగారమ్మ తల్లి గుడిని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. బంగారమ్మతల్లి గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు గ్రామస్తులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు అధికారులు దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయానికి నిధుల మంజూరుకు సిఫారసు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ, శ్రీను, పెదరాజునాయుడు పాల్గొన్నారు.

నగరంలో కార్డన్ సెర్చ్


తనిఖీ చేస్తున్న పోలీసులు

దొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు జామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

నేరాల నియంత్రణపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలి న్యూహోల్‌సేల్ మార్కెట్ వద్ద నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాల నియంత్రణపై ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, కళాశీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సాయి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, దొంగతనాలు, ట్రాఫిక్ నియంత్రణపై జోన్–1 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ అవగాహన కల్పించారు. దుకాణ సముదాయాలు, ఆటో స్టాండ్‌లు, అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు సంఘాల భవనాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు మాట్లాడుతూ ప్రజలు, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

మర్యాదపూర్వక కలయిక


వైవీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి సత్యనారాయణపురంలో మంజూరు చేసిన 1214 టిడ్కో ఇళ్లు రద్దు చేసిన కారణంగా, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పార్టీ పటిష్టతకు కష్టపడి పని చేసే కార్యకర్తలకు స్టేట్, జిల్లా కమిటీలో ప్రాధాన్యత గల పదవులు ఇవ్వాలని కోరారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావుకు వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వాలని సిఫారసు చేశారు. దీనికి వైవీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకం కాదు


సూచనలు చేస్తున్న డాక్టర్ శృతి

దాబాగార్డెన్స్ : బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకం కాదని, అప్రమత్తంగా ఉంటే మేలని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ శృతి పేర్కొన్నారు. అన్ని క్యాన్సర్లు ప్రాణాంతకం అయినప్పటికీ జాగ్రత్త వహిస్తే బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఏవీఎన్ కళాశాల ఉమెన్ అసోసియేషన్ వింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల సెమినార్ హాల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శృతి మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెలగా అక్టోబర్ నెలంతా కార్యక్రమాలు చేపడుతున్నామని, మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పొంది క్రమం తప్పకుండా మందులు వాడాలని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ప్రాణనష్టం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, ఉమెన్ అసోసియేషన్ వింగ్ అధ్యక్ష, కార్యదర్శి ఎం. స్వరాజ్యలక్ష్మీ, కృష్ణకుమారి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, మల్లిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 12న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ రొంపల్లి రామకృష్ణ మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తవలసకు చెందిన రాంపల్లి రామకృష్ణ రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఆయన మృతి చెందాడు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. భీమిలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విచారణ చేపడుతున్నామని.. రామకృష్ణ మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు.

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7–23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నెక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. చోరీ అయిన వాటిలో బంధువుల ఆభరణాలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దివ్యాంగునికి ఆర్థిక సాయం


దుప్పర్తి పవన్‌కుమార్‌కు నగదును అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న దుప్పర్తి శ్రీనివాస్ కుమారుడు పవన్‌కుమార్‌కు సాంకేతిక కారణాలతో పెన్షన్ నిలిపివేశారు. సమస్య తెలుసుకున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ స్పందించి సొంత నిధుల నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 3 వేల నగదును కేటాయించగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ శుక్రవారం పార్టీ కార్యాలయంలో పవన్‌కుమార్‌కు ఆ నగదును అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని పూర్ణిమ తెలిపారు.

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14 బాలురు, బాలికల విభాగాల పోటీలు, ఎంపికలు పరవాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని ఇండోర్ స్టేడియంలో, అండర్ 17 బాలురు బాలికల పోటీలు, ఎంపికలు బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.

10న యోగా పోటీలు

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ స్థాయి యోగా పోటీలు, ఎంపికలు ఈ నెల 10వ తేదీన పరవాడ మండలం ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. బాలురు, బాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్న జట్ల ఎంపిక చేపడతామని తెలియజేశారు.

ఆరోగ్య శిబిరాల నిర్వహణకు సహకరించాలి


యూపీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం అల్లిపురం, భానోజీనగర్, జ్ఞానాపురం, లక్ష్మీనగర్ యూపీహెచ్‌సీలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అల్లిపురంలోని 8 సచివాలయాలు, భానోజీనగర్‌లో పది సచివాలయాల్లో సర్వే త్వరితగతిని చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలకు త్వరలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల కోసం ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ శిబిరాలకు డెంటల్, కంటి వైద్యులు, గైనిక్, జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్యులు హాజరయ్యే విషయం దండోరా వేయించాలన్నారు. రక్త పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ గురించి తెలపాలన్నారు. ఈ హెల్త్ క్యాంప్‌లు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సమన్వయకర్త డాక్టర్ బి.ఉమావతి, మల్టీపర్పస్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భరోసా


అమ్మవారి వీధిలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న రంధి గోపి తదితరులు

అల్లిపురం : పేదల సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం వార్డులోని వేంకటేశ్వరమెట్ట సచివాలయం పరిధి మిరపకాయలవీధిలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. దీంట్లో భాగంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు భీశెట్టి రాజు, ఆదారి వెంకట మహేష్, ఏఎన్ఎం, ఆశ వర్కర్ నాగజ్యోతి, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్, వలంటీర్ డి.అభిలాష్ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. త్వరలో జరగనున్న వైద్య శిబిరాన్ని కుటుంబంలో ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

దేవీ శరన్నవ రాత్రుల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్ : ఈ నెల 15 నుంచి 23 వరకు కనకమహాలక్ష్మి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ఎం. ధనలత, బి. వెంకటరత్నం, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సురేష్, జి. ప్రకాష్, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


36వ వార్డు జామియా మసీదులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, స్టేట్ డైరెక్టర్ రీసు అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, బోణి దేవ, దూడ అప్పారావు, పచ్చిరిపల్లి రాము, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి తక్షణ పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులతో మాట్లాడారు. 36వ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు, ముస్లిం నాయకులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు ఏఎంసీ ముస్తాబు

మహారాణిపేట : ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు పండగ వాతావరణంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రూ. 60 లక్షల వ్యయంతో ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జి ఆస్పత్రులలో మరమ్మతు పనులు చేపట్టారు. ఏఎంసీలోని పానగల్ భవనానికి ఆనుకుని ఉన్న అన్ని భవనాల్లో రూ. 30 లక్షలతో పనులు చేపట్టారు. అలాగే కేజీహెచ్‌లో క్యాజువాలిటీ విభాగం సుందరీకరణ, ఇతర మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు పది రోజుల్లో పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఏపీ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ డీఈఈ మన్మథరావు తెలిపారు.

మీడియాపై దాడులను నిరసిస్తూ ధర్నా

సీతమ్మధార : దేశ రాజధాని ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ అరెస్ట్, మరి కొంత మంది మీడియా ప్రతినిధులపై దాడిని నిరసిస్తూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులు ధర్నా చేపట్టారు. మీడియా ప్రతినిధులను అరెస్ట్ చేయడం సరి కాదని, ఇది మీడియా స్వేచ్ఛను హరించినట్లు అవుతుందని పలువురు జర్నలిస్టులు అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణరావు, మధు, డి.రవికుమార్, ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.